క్యాన్సర్‌కు ఆన్సర్ ఉంది

- ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను నివారించవచ్చు
- అందుబాటులో ఆధునిక వైద్య సేవలు
- జూన్ క్యాన్సర్ సర్వైవర్స్ నెల


జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్



క్యాన్సర్ సర్వైవర్స్ పోస్టర్

గుంటూరు మెడికల్: పూర్వ రాచపుండుగా పిలువబడే క్యాన్సర్ వ్యాధికి చికిత్స ఉండేది కాదు. వ్యాధిగ్రస్తులు మరణానికి రోజులు లెక్క బెట్టుకుంటూ గడిపేవారు. ప్రస్తుతం ఈ పరిస్థితి మారింది. ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. క్యాన్సర్‌ను నిర్ధారించే దశను బట్టి, అందించే చికిత్సను బట్టి క్యాన్సర్‌ను త్వరగా నివారించవచ్చు. ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేస్తే నూటికి 95శాతం క్యాన్సర్‌లను నివారించవచ్చు. క్యాన్సర్ ఉన్న వాళ్లల్లో వ్యాధిపై ఉన్న భయాన్ని పోగొట్టి వారిలో మానసిక ధైర్యాన్ని నింపేందుకు ప్రతి ఏడాది జూన్‌ను క్యాన్సర్ సర్వైవర్స్ మంత్‌గా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

క్యాన్సర్ కారణాలు..

క్యాన్సర్ రావటానికి ప్రధాన కారణం పొగాకు ఉత్పత్తుల వినియోగమే. సిగిరెట్, బీడీ, చుట్ట, పాన్‌పరాగ్, ఖైనీ, గుట్కా ఇలా ఏ రూపంలో పొగాకును తీసుకున్నా క్యాన్సర్ వస్తుంది. మద్యపానం వల్ల, వ్యాయామం చేయకపోవటం, ఆకు కూరలు తినకపోవటం, ఊరగాయపచ్చళ్లు, కొవ్వు ఎక్కువగా ఉన్న మాంసాహారం తినటం, అధిక బరువు ఉండటం వల్ల కొన్ని రకాల క్యాన్సర్‌లు వచ్చే అవకాశం ఉంది.

క్యాన్సర్ రాకుండా...

ఊబకాయం వల్ల చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. బరువును అదుపులో ఉంచుకోవటం ద్వారా క్యాన్సర్ సోకదు. షుగర్ కంట్రోల్‌లో పెట్టుకోవాలి. జెనటిక్ టెస్ట్‌లు చేయించుకోవాలి. కుటుంబంలో ఒకరికి క్యాన్సర్ ఉంటే ఇతర సభ్యులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. తాజా కూరగాయలు, ఆకు కూరలు తీసుకోవాలి. వీటిల్లో క్యాన్సర్ కారకాలతో పోరాడే యాంటిజెంట్స్ ఉంటాయి. మాంసాహారం తీసుకునేవారు తప్పనిసరిగా వెజిటబుల్ లేదా ఫ్రూట్ సలాడ్ తినాలి. కొవ్వుశాతం తక్కువగా ఉన్న ఆహారం తీసుకుంటే క్యాన్సర్‌లు వచ్చే అవకాశాలు తక్కువ. భోజనంతో తాజా పండును ప్రతి రోజూ తీసుకోవాలి. ప్రతిరోజూ కనీసం అరగంటసేపు శారీరక వ్యాయామం చేయాలి. స్మోకింగ్, మద్యం, పాన్, గుట్కా లాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి.

గుంటూరు జీజీహెచ్‌లో రూ.33 కోట్లతో అత్యాధునిక వైద్య సౌకర్యాలతో క్యాన్సర్ వార్డు నిర్మాణం జరిగింది. క్యాన్సర్ రోగులకు అత్యాధునిక వైద్యసేవలను అందించే సుమారు రూ.17 కోట్లు ఖరీదు చేసే లీనియర్ యాక్సిలేటర్, ఇతర వైద్య పరికరాలు జీజీహెచ్‌లో ఉన్నాయి.

చికిత్స పొందిన వారి వివరాలు....

గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో 2021లో ఓపీ విభాగంలో 5,865 మంది చికిత్స పొందారు. ఆపరేషన్లు 114 చేశారు. 2022లో 13,102 మంది చికిత్స పొందగా 395 ఆపరేషన్లు జరిగాయి. 2023లో 14,648 మంది చికిత్స పొందగా 753 ఆపరేషన్లు జరిగాయి. 2024లో నేటికి 6,924 మంది చికిత్స పొందగా 327 ఆపరేషన్లు జరిగాయి. 6/16/2024 6:21:39 PM

ఉచితంగా క్యాన్సర్ మందులు..



క్యాన్సర్ రోగులకు ప్రతి ఏడాది రూ.2 కోట్లు ఖరీదు చేసే మందులు నాట్కో ట్రస్ట్ ద్వారా జీజీహెచ్‌కు వచ్చే రోగులకు ఉచితంగా అందజేస్తున్నాం. రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించేలా నాట్కో ట్రస్ట్ నిర్వాహకులు వీసీ నన్నపనేని పలు కార్యక్రమాలు జీజీహెచ్‌లో రెగ్యులర్‌గా నిర్వహిస్తున్నారు. క్యాన్సర్ రోగులతోపాటుగా ఆస్పత్రిలోని పలు వార్డులను నాట్కో ట్రస్ట్ అభివృద్ధి చేసి పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించేందుకు కృషి చేస్తుంది.

–యడ్లపాటి అశోక్‌కుమార్, నాట్కో ట్రస్ట్ కో ఆర్డినేటర్.

జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం....



గుంటూరు జీజీహెచ్‌లో క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేకంగా వంద పడకలతో ప్రభుత్వం, నాట్కో ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రూ.40 కోట్లతో నన్నపనేని లోకాదిత్యుడు, సీతారావమ్మ స్మారక క్యాన్సర్ సెంటర్ నిర్మాణం చేపట్టాం. రోగులకు ఆధునిక వైద్యసేవలను అందించేందుకు ప్రభుత్వం లీనియర్ యాక్సిలేటర్, బ్రాకీథెరపీ, సీటీ స్టిమ్యులేటర్ వైద్య పరికరాలను విదేశాల నుంచి కొనుగోలు చేసి జీజీహెచ్‌కు పంపించింది. అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో క్యాన్సర్ రోగులకు కార్పొరేట్ వైద్యసేవలను పూర్తి ఉచితంగా అందజేస్తున్నాం. త్వరలోనే మరో వంద పడకలతో క్యాన్సర్ సెంటర్ నిర్మాణం చేసేందుకు రంగం సిద్ధం చేశాం.

–నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ వైస్ చైర్మన్

అందుబాటులో ఆధునిక వైద్యం..



క్యాన్సర్‌ను నయం చేసే ఆధునిక వైద్య పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. మెమోగ్రామ్ ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించవచ్చు. పాప్ స్మియర్ ద్వారా సర్వైకల్ క్యాన్సర్‌ను, కొలనోస్కోపీ ద్వారా కోలన్ క్యాన్సర్‌లను గుర్తించవచ్చు. చాలా ఏళ్లుగా స్మోక్ చేస్తున్న వారు చెస్ట్ సీటీ స్కాన్ చేయించుకోవాలి. ముందస్తుగా వ్యాక్సిన్‌లు వేయించుకోవటం ద్వారా గర్భాశయముఖ ద్వారా క్యాన్సర్‌ల నుండి రక్షించుకోవచ్చు. 9 నుంచి 11 సంవత్సరాల బాలురు, బాలికలకు పోరల్, త్రోట్ క్యాన్సర్‌లు రాకుండా ముందస్తుగా వ్యాక్సిన్‌లు చేయించాలి.

–డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్యనిపుణురాలు, గుంటూరు

బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

పట్నంబజార్: ముస్లిం సోదర సోదరీమణులకు శాసన మండలి సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగ నిరతికి, ధర్మ బద్ధతకి, దాతృత్వానికి బక్రీద్ ప్రతీకగా నిలుస్తుందన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ పండుగ జరుపుకుంటారన్నారు. పేద, ధనిక తారతమ్యాలు లేకుండా రాగ ద్వేషాలకు అతీతంగా ముస్లింలంతా ఈ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటారన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని అప్పిరెడ్డి అభిలషించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



తెనాలిరూరల్: విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి, 500 మార్కులకు పైగా సాధించిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ కార్యక్రమాన్ని పట్టణానికి చెందిన బాబూ జగ్జీవన్ రామ్(బీజేఆర్) కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళా క్షేత్రంలో జరిగిన కార్యక్రమానికి కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్ అధ్యక్షత వహించారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన పలువురు ప్రముఖులు అతిథులుగా పాల్గొన్నారు. తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల, వేమూరు, కొల్లూరు, అమృతలూరు, చుండూరు, చేబ్రోలు మండలాలకు చెందిన విద్యార్థులు 25 మందికి రూ.5 వేలు చొప్పున నగదు, నూతన వస్త్రాలు, కలేజ్ బ్యాగ్, వాటర్ బాటిల్‌ను అందజేశారు. సీనియర్ ఏపీపీ సుద్దపల్లి సుకుమార్, ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్, న్యాయవాది ఇందుపల్లి రాజారాం, ప్రొఫెసర్ పాన్నెకటి రత్నాకర్, మేకల రవికుమార్, బీజేఆర్ కమిటీ సభ్యులు అత్తోట శరత్‌బాబు, సిద్దెల కమలాకర్, నలుకుర్తి సద్గుణరావు, సుద్దపల్లి నాగరాజు, నలుకుర్తి రమేష్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ



నగరంపాలెం: వయోవృద్ధులు, దివ్యాంగులను ఆదుకోవాలని గిరిధారి మిత్రమండలి అధ్యక్షులు బవిరిశెట్టి శ్రీనివాసరావు కోరారు. కొత్తపేట సోమువారివీధిలోని మండలి కార్యాలయంలో వృద్ధులకు నిత్యవసరాల కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది వయోవృద్ధులు కుటుంబ సభ్యుల ఆదరణ నోచుకోలేకపోతున్నారని అన్నారు. దీంతో ఒంటరి జీవితాన్ని గడుపుతున్నారని పేర్కొన్నారు. వృధాప్యం దృష్ట్యా ఏ పని చేయలేకపోతున్నారని, అటువంటి వారికి తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పలకలూరు శివరావు, కోశాధికారి దిండు రాజశేఖర్, మండలి సభ్యులు జుజ్జూరు శివకుమార్, పబ్బిశెట్టి సంజీవరావు, గార్లపాటి రోశయ్య, పీఎస్ఆర్.గుప్తా, సింగంశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.

108 మంది పేదలకు పెన్షన్లు అందజేత



నగరంపాలెం: ప్రతి నెల 108 మంది పేదలకు పెన్షన్లు, వైద్య పరీక్షలతోపాటు మందులు పంపిణీ చేయడం అభినందనీయమని ప్రముఖ వైద్యులు చింతా రామకృష్ణ అన్నారు. అరండల్‌పేటలోని ఆర్యవైశ్య ఆఫీషియల్స్/ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) కార్యాలయంలో ఆదివారం 108 మంది పేదలకు పెన్షన్లు పంపిణీ చేయగా, అధ్యక్షులు కేవీ బ్రహ్మం అధ్యక్షత వహించారు. వైద్యులు రామకృష్ణ మాట్లాడుతూ పెన్షనర్లకు వేదాంత ఆస్పత్రిలో ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తామని అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం పసుమర్తి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పేదలు బ్యాంక్‌ల్లో అందుబాటులో ఉన్న వివిధ రకాల రుణాలు తీసుకుని, స్వతహాగా జీవించాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, నగర కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, ఉటుకూరి నాగేశ్వరరావు, రమణానంద్, అమరా రమేష్, కార్యక్రమ సమన్వయకర్త మద్ది సాయిరమేష్, పెన్షన్ కన్వీనర్ వెంకట్రావు పాల్గొన్నారు.

నవ్వుల్లో ముంచెత్తిన హాస్యవల్లరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం గుంటూరు హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో హాస్యవల్లరి ప్రదర్శించారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి షేక్ లాల్ వజీర్ జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. నటీనటులు పి.రమేష్, ఎ.నాగజ్యోతి, ఆచార్యులు జె.కిశోర్‌బాబు, డాక్టర్ కె.కళాధర్, పి.మంగయ్య, మధువని, డాక్టర్ బీబీ.అప్పారావు, డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డాక్టర్ ఎం.రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఎస్.వి.కె.ప్రసాద్ ఎన్నికలలో, చిరు సన్మానం, ఇదెక్కడి గొడవే వంటి లఘు హాస్య నాటికలను ప్రదర్శించగా, ప్రేక్షకులను అలరించాయి.

ఉచితంగా దుక్కి దున్నుకునేందుకు అవకాశం



తెనాలిరూరల్: మండలంలోని పెదరావూరు గ్రామానికి చెందిన పాలడుగు రంగయ్య, అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద రైతులకు ఉచితంగా దుక్కి దున్నే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు పాలడుగు అంజయ్య మాట్లాడుతూ 1999లో ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి రెండెకరాల లోపు పొలం ఉన్న పేద రైతులకు ఉచితంగా దుక్కి దున్నిస్తున్నట్టు తెలిపారు. ఏటా 100 ఎకరాల్లో ఉచితంగా దుక్కి దున్నుతున్నట్టు చెప్పారు. జిల్లాలోని జెడ్పీ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రథమ శ్రేణి సాధించిన విద్యార్థులకు ఆగస్ట్ 15న నిర్వహించే కార్యక్రమంలో స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్టు తెలిపారు. ఈదర వెంకటపూర్ణచంద్, పాలడుగు సురేంద్ర, గుమ్మడి ప్రసాద్, కత్రి హరనాథరెడ్డి, పాలడుగు సుధీర్, సాల్మన్, పాలడుగు పూర్ణచంద్రరావు, పాలడుగు కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, కిషోర్, నాగేశ్వరరావు, రమేష్, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

వందల ఏళ్ల నాటి చరిత్ర కలిగిన దేవస్థానం


లాలాపేటలోని శ్రీపద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం


శ్రీవేంకటేశ్వరస్వామి

నగరంపాలెం: వందేళ్ల చరిత్ర కలిగిన గుంటూరు లాలాపేటలోని శ్రీపద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు శ్రీస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం ఇప్పటికే ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన ముగించారు. అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. క్రీ.శ. 1717లో ఉత్తరాదిన నివసించే భక్తులు అయోధ్య జగన్నాధదాసుబావాజీ, అయోధ్య శ్యామలదాసుబావాజీ, అయోధ్య భగవాన్‌దాసుబావాజీ దక్షిణానికి వలస వచ్చారు. ఈ క్రమంలో మూడు మఠాలను నెలకొల్పగా, అందులో లాలాపేటలో పద్మావతి ఆండాళ్ సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం, కొత్తపేట(పశువుల ఆసుపత్రి ఎదురు)లోని మఠంలో జగన్నాధస్వామి, కొత్తపేట గుంటగ్రౌండ్ ఎదురు మఠంలో ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించారు.

పురాతన దేవాలయం..

గుంటూరు నగరంలో అతి పురాతనమైన దేవాలయం పద్మావతి ఆండాళ్ సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం. గతంలో దేవస్థానంలో పెళ్లిళ్లు, తలనీలాలు, అన్నప్రాసన, మొక్కుబడులు తీర్చుకునేందుకు భక్తులు తరలివచ్చేవారు. ఇక్కడ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే తిరుమల వెంకన్నను దర్శించుకున్నట్లేనని నానుడి భక్తుల్లో ఉండేది. దీంతో ఉమ్మడి జిల్లాతోపాటు ఇతరత్రా జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి, స్వామి, అమ్మవార్లను దర్శించుకునేవారు.

ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు..

ఈనెల 17 సోమవారం వేకువజాము నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఉదయం 8 గంటలకు స్వామిని, అమ్మవార్లను పెండ్లి కుమారునిగా, పెళ్లి కుమార్తెలుగా అలకరించనున్నారు.

సాయంత్రం 6 గంటలకు అంకురారోపణ, ధ్వజారోహణ, విశ్వేశ్వర పూజ పుణ్యావచన అఖండ దీపారాధన అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టనున్నారు. 18న స్వామి వారికి మోహిని అలంకారం, రాత్రి 7 గంటలకు హనుమత్ వాహనంపై గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించనున్నారు. 19న దశావతారాల అలంకారం, రాత్రి 7 గంటలకు హంస వాహనంపై గ్రామోత్సవం, 20న విశ్వరూపం అలంకారం, రాత్రికి గజవాహనంపై గ్రామోత్సవం, ఎదురుకోలా ఉత్సవం, స్వామి కల్యాణం, 21న చందనం అలంకారం, ఉదయం 7 గంటలకు గరుడ వాహనంపై గ్రామోత్సవం, రాత్రికి శ్రీస్వామి వారి రథోత్సవం, 22న తులసి అలంకారం, ఉదయం 8 గంటలకు వసంతోత్సవం చక్రస్థానం, మధ్యాహ్నం పూర్ణాహుతి రాత్రి 7 గంటలకు ధ్వజ అవరోహణ శేష వాహనంపై గ్రామోత్సవం, 23న పచ్చ కర్పూరంతో అలంకారం, రాత్రి 7 గంటలకు ద్వాదశ ప్రదక్షిణాలు పవళింపు సేవ జరగనున్నాయని శ్రీ జగన్నాథ శ్రీ ఆంజనేయ శ్రీవెంకటేశ్వర స్వామి వార్ల దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, దేవస్థానం ఏసీ (ఈఓ) డి.శ్రీనివాసరావు తెలిపారు.

ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు దేవస్థానంలో నిత్య హోమం బలిహరణ, ఉదయం 10 గంటలకు 108 కలశాలతో అష్టోత్తర కలశం అభిషేకాలు జరగనున్నాయని పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా వరుస (క్యూ)లను, మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేశారు. దేవస్థానాన్ని విద్యుత్తు వెలుగులతో అలకరించారు.

నరాల సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ నీరజ


మాట్లాడుతున్న న్యూరాలజిస్ట్ డాక్టర్ నీరజ

లక్ష్మీపురం: నరాలకు సంబంధించిన సమస్యలపై ప్రధానంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు రక్తపోటుతో ఉన్నవారు అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ కె.నీరజ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్యసభ ఆదివారం నిర్వహించారు. సమావేశానికి సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధుమేహ వ్యాధిగ్రస్తులు సుగర్ లెవెల్స్‌ను నియంత్రించుకోవాలని కోరారు. రక్తపోటును నియంత్రణలో ఉంచుకోకుంటే బ్రెయిన్ స్ట్రోక్‌కు దారి తీసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.

సాధారణంగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన నాలుగు గంటల లోగా నార్మల్‌కు సంబంధించిన వైద్యుల వద్దకు వెళ్లగలిగితే చాలా ఉత్తమమైన ఫలితాలు వస్తాయని తెలిపారు. ఒక్కసారి బ్రెయిన్ స్ట్రోక్ వస్తే జీవితాంతం మందులు వైద్యుల సలహా మేరకు వాడాలని తెలిపారు. ఉన్నట్టుండి నడకలో గాని, మాటలో గాని, చూపులో గాని తేడాను గమనిస్తే అవి ఎక్కువ శాతం బ్రెయిన్ స్ట్రోక్‌కు సంబంధించిన సంకేతాలుగా భావించి వెంటనే న్యూరాలజిస్టును సంప్రదిస్తే మంచిదని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ నీరజను ఘనంగా సత్కరించారు. ఈ ఆరోగ్య సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ముప్పాళ్ల ప్రసాద్ రావు, సంస్థ సీనియర్ సభ్యులు ఆర్.రామచంద్ర రావు విశ్లేషకులు పాముల రెడ్డి పాల్గొన్నారు.

ఫాదర్స్ డే వేడుకలు

నాన్న ప్రేమకు ఎల్లలుండవని పిల్లలకు ఎలాంటి కష్టం తెలియకుండా పెంచి పెద్ద చేసేందుకు పిల్లలకు మంచి జీవితాన్ని ఇచ్చేందుకు తండ్రి పడే కష్టం అంతా ఇంతా కాదని ప్రముఖ గాయకుడు డి.టి.సాయిబాబు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఫాదర్స్ డే నిర్వహించారు. సినీ దర్శకులు కె.జయకుమార్ పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌కు పలువురు అభినందనలు


మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న వనమా నరేంద్రకుమార్

గుంటూరు మెడికల్: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్‌ను ఆదివారం జిల్లాకు చెందిన బీజేపీ నేతలు వెలగపూడిలోని మంత్రి కార్యాలయంలో కలసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాటిబండ్ల రామకృష్ణ, యడ్లపాటి స్వరూపారాణి, రాష్ట్ర పదాధికారులు కొక్కెర శ్రీనివాస్, గాజుల వెంకయ్య నాయుడు, జిల్లా పదాధికారులు పెరుమాళ్ల అనంత పద్మనాభం తదితరులు ఉన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్..

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా సత్య కుమార్ యాదవ్ ఆదివారం వెలగపూడిలోని సెక్రటేరియట్‌లో పదవి బాధ్యతలు స్వీకరించారు. మంత్రిని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందచేశారు. జీజీహెచ్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సూపరింటెండెంట్ వెంట ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో ఆదివారం చండీ హోమం నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో దశపాపహరం సందర్భంగా విశ్వ శాంతిని కాంక్షిస్తూ భక్తిశ్రద్ధలతో హోమం జరిగింది. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులు తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతి స్వామికి, శివలింగానికి, నవ గ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీ గణపతి, చండీ, రుద్ర హోమాలు, పూర్ణాహుతి చేపట్టారు.

చింత చెట్లకు దుండగుల నిప్పు

- కలప కోసం పర్యావరణానికి చేటు
- పట్టించుకోని నేషనల్ హైవే, ఆర్ అండ్ బి అధికారులు


మొదట్లో కాలుతున్న చెట్టు

ఫిరంగిపురం: పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే భారీ చెట్లకు ఆగంతకులు నిప్పుపెట్టడంతో అవి కూలిపోతున్న సంఘటనలు మండల పరిధిలో చోటుచేసుకుంటున్నాయి. మండలంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల చింత చెట్టు మొదల్లో రాత్రి సమయాల్లో దుండగులు నిప్పు పెడుతున్నారు. దాంతో చెట్టు కాండం పూర్తిగా కాలి పడిపోతోంది. కొద్దిరోజుల తరువాత వచ్చి వాటిని మిషన్ ద్వారా ముక్కలుగా చేసి వాటిని విక్రయిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

గుంటూరు – కర్నూలు రాష్ట్ర రహదారికి ఇరువైపులా మండల పరిధిలో సుమారు 130 వరకు భారీ చెట్లు ఉన్నాయి. వాటిలో చింత చెట్లు ఎన్నో ఏళ్లుగా ఉన్నాయి. తొర్రలు ఏర్పడటంతో వాటిలో ఆగంతకులు నిప్పు పెడుతున్నారు. కొద్దిరోజుల కిందట మేరికపూడి సమీపంలో, వేములూరిపాడు గ్రామ సమీపంలో నిప్పుపెట్టి చెట్లను కూల్చి వేశారు. కాగా శనివారం రాత్రి రేపూడి గ్రామశివారులో చెట్టుకు నిప్పు పెట్టడంతో గుంటూరు– కర్నూలు రాష్ట్ర రహదారిపై కూలిపోయింది. ఇలా చెట్లకు నిప్పు పెట్టి వాటిని ఆగంతకులు విక్రయిస్తున్నా నేషనల్ హైవే అధికారులు, ఆర్ అండ్‌బీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వాహన రాకపోకలకు ఇబ్బంది

రోడ్డుకు అడ్డుగా చెట్టు కూలడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రాత్రి సమయాల్లో దగ్గరగా వచ్చేవరకు చెట్టు కూలి ఉన్న సంగతి తెలియడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు సంభవించక ముందే సంబంధిత శాఖల అధికారులు స్పందించి కూలిన చెట్టును తొలగించాలని, చెట్లకు నిప్పుపెట్టకుండా వాటిని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామిగా దర్శనమిచ్చిన వేణుగోపాలస్వామి


శ్రీలక్ష్మీ అష్టాక్షరి నారాయణ నిత్య హోమం


శ్రీలక్ష్మీ నరసింహస్వామి అలంకారంలో..

నగరంపాలెం: కొత్తపేటలోని జగన్నాథ స్వామి దేవస్థానంలో శ్రీరుక్మిణి సత్య భామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజుకు చేరాయి. ఆదివారం స్వామికి శ్రీలక్ష్మీనరసింహస్వామి అలంకారణ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించగా, శ్రీలక్ష్మీ అష్టాక్షరి నారాయణ నిత్యం హోమం చేపట్టారు. ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను దేవస్థానం సహాయ కమిషనర్(ఈఓ), డి.శ్రీనివాసరావు, దేవస్థానం చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు శ్రీఅయోధ్య అయ్యప్ప పర్యవేక్షించారు.

అలరించిన స్వరాలాపన



నగరంపాలెం: తెలుగువారి సాంస్కృతిక సంగీత కళావేదిక –ఏపీ, నటరత్న డాక్టర్ ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అమరావతిరోడ్ అన్నదాన సమాజం ఆడిటోరియంలో స్వరాలాపన నిర్వహించారు. తెలుగు సినీ లెజెండ్స్, సంగీత దర్శకులు అందించిన మధురమైన గీతాలను పలువురు గాయనీ, గాయకులు ఆలపించారు. సభికులను, ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో అధ్యక్షులు డి.బాలస్వామి, ప్రధాన కార్యదర్శి కె.బాబూరావు, ఉపాధ్యక్షులు కంచర్ల రాజేంద్రకుమార్, బి.రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు.